చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

బహుమతి ఇస్తున్న సుధాకర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె: చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు వైఎస్ ఎంపిపి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జడ్‌పి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి అధ్యక్షతన ఎంఇఒలు వెంకట్రామిరెడ్డి, రమాదేవి ఆధ్వర్యంలో సర్వత్ర ఫౌండేషన్ వారు పదవ తరగతి ఫలితాలలో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థినిలకు ఉన్నత చదువుల కొరకై ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు, సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు విద్య పట్ల శ్రద్ధతో చదవగలిగితే ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వత్ర ఫౌండేషన్ సభ్యులు సందీప్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెసి కాలువలో నీరు పారేదెలా?

ఆధునికీకరణకు నోచని కాలువ

మురికికూపంగా మారిన వైనం

ఆయకట్టు రైతులకు తప్పని ఇబ్బందులు

ఓబుళరెడ్డిపేట వద్ద సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్న కెసి కాలువ

ప్రజాశక్తి-చాపాడు

జిల్లాలోనే అధికంగా వ్యవసాయానికి సాగునీరు అందించే ప్రాజెక్టులలో కెసి కెనాల్ ప్రధానమైనది. జిల్లాలో సుమారుగా 92వేల ఎకరాలకు కెసి కెనాల్ పరిధిలో సాగునీరు అందే అవకాశం ఉంది. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో వ్యవసాయానికి నీరు అందడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండల పరిధిలో రాజోలి ఆనకట్ట వద్ద నుండి జిల్లాలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరు మండల పరిధిలోని రాజుపాలెంతోపాటు చెన్నూరు, కడప మండలాల్లో కెసి కాలువకు నీరు పంటపొలాలకు అందుతోంది. కెసి కాలువ వెంబడి కంప చెట్లు విపరీతంగా పెరిగి కాలువ బలహీనపడింది. కొన్ని ప్రదేశాలలో సిమెంట్ లైనింగ్‌లు దెబ్బతిని కాలువ కోతకు గురవుతోంది. కెసి కాలువలో పూడికతీత పనులను ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతుండటంతో ఎక్కువ ప్రాంతాల్లో పూడికతీత సమస్య మాత్రం కనిపించడం లేదు. ఏటూరు కాలువలో ఉపాధి పనులు చేపట్టారు. మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలో మాత్రం పూడిక సమస్య కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం షెటర్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. మైదుకూరు నుండి కొండపేట కాలువలో ఆకులు, అలములు అధికంగా ఉండడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా ఉంది. పట్టణ పరిధిలో ఉన్న కాలువలలో వ్యర్థ పదార్థాలు వేస్తుండడంతో రైతులకు ఇబ్బందికరంగా ఉంది. చాపాడు ఛానల్ ద్వారా చివరి ఆయకట్టుకు కాలువలలో వ్యర్థపదార్థాలు లైనింగ్ పనులు దెబ్బతినడంతో నీటిప్రవాహం సజావుగా సాగడం లేదు. కెసి కెనాల్ కాలువలను పరిరక్షించే సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో అక్రమ నీటి వాడకం, నీటి వృథా జరుగుతోంది. ఆగస్టు మొదటివారంలో కెసి కాలువకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందించి కెసి కాలువలో అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చివరి ఆయకట్టుకు అందని నీరు

కెసి ప్రధాన కాలువకు నీరు ప్రతి సంవత్సరం విడుదలవుతున్నప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఉప కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. చాపాడు ఛానల్ నుంచి ఖాదరపల్లె, చాపాడుకు వచ్చే కాలువ డ్రెయినేజీ నీటితో పూర్తిగా నిండిపోయినది. ఈ కాలువలలో పూడికతీత పనులు చేపట్టి చివరి ఆయకట్టకు నీరు అందేలా చూడాలి.

- మస్తాన్, రైతు, చాపాడు.

కాలువల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలి

కెసి కాలువ నీటి ఆధారంగా వరి పంటను సాగు చేపడతాం. తూముల వద్ద షెట్టర్ల నిర్వహణపై సరైన పరిరక్షణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొన్ని సందర్భాల్లో నీరు అధికంగా రావడం, అవసరమైన సందర్భంలో నీరు తక్కువ రావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. షెటర్ల పర్యవేక్షణకు నిరంతరం సిబ్బంది పర్యవేక్షణ ఉండాలి.

- ఆంజనేయులు, రైతు, సిద్ధారెడ్డిపల్లి.

రూ.3.38 కోట్లతో కెసి అభివృద్ధి

కెసి కాలువలో మరమ్మతు పనులు, ఉపకాల్వలలో సిమెంట్ లైనింగ్ తదితర అభివృద్ధి పనులను రూ.3.38 కోట్లతో చేపట్టేందుకు చర్యలు జరుగుతున్నాయి. చాపాడు చానల్, ఏటూరు కాలువ పరిధిలో కెసి కాలువ దెబ్బతిన్న ప్రాంతాలలో మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఉప కాలువలలో సిమెంట్ లైనింగ్ ఏర్పాటుకు టెండర్లు కూడా పూర్తయి కొన్ని పనులు ప్రారంభమైనాయి. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా పూడికతీత, కట్టల మీద కంపచెట్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ఆగస్టులో కెసికి నీరు వచ్చే సమయానికి కాలువలు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం.

- జాన్సన్, ఎఇ, కెసి కెనాల్, చాపాడు.

ఖాదర్‌పల్లె వద్ద కెసి ఉప కాలువ పరిస్థితి

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక ఖరారు

- 88,228 ఎకరాల్లోనే సాగుకు అవకాశం
- 663 క్వింటాళ్ల విత్తన ప్రతిపాదనలు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక ఖరారైంది. జిల్లాలో 1,79,808 లక్షల ఎక రాల విస్తీర్ణంలో సాగు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఏడాది జూన్ నుంచి జులై రెండవ వారం గడు స్తున్నప్పటికీ 11,495 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 4.78 శాతానికి మించి సాగుకు నోచు కోకపోవడం గమనార్హం. ఇటువంటి విపత్కర పరిస్థి తుల నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ మూడు దశ లుగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపకల్పన చేసింది. మొదటి దశ జులై 15, రెండవ దశ జులై 30, మూడవ దశ ఆగస్టు 15 వరకు ప్రణాళిక రచించింది. మొదటి దశ జులై 15 నాటికి 88,228 ఎకరాల్లోనే పంటల సాగుకు అవకాశం ఉందనే అంచనా వేసింది. ఇటు వంటి తరహా వాతావరణ పరిస్థితుల కొనసాగింపు ఆధారంగా ప్రణాళికను రూప కల్పన చేసింది. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సంబంధించిన అవసరాల మేరకు విత్తన, ఎరువులు, పురుగుమందుల లభ్యతను అందు బాటులో ఉంచింది. ఇటువంటి పరిస్థితుల్లో మిగిలిన 91. 580 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు సంబంధించిన అప రాల సాగు వివరాలు, విత్తన అవసరాలను పరిగ ణలోకి తీసుకుంది. జిల్లా వ్యవసాయశాఖ 663 క్వింటాళ్ల విత్తన ప్రతిపాదనలు అందజేసింది. ప్రధానంగా 3,087 ఎక రాల్లో కందుల సాగుకు సంబంధించి 250 క్వింటాళ్లు విత్త నాలు, 4,816 ఎకరాల్లో 390 క్వింటాళ్ల మేరకు మినుములు, 518 ఎకరాల్లో 10 క్వింటాళ్ల మేరకు సజ్జ , 247 ఎకరాల్లో ఐదు క్వింటాళ్లలో కొర్ర, 321 ఎకరా ల్లో రాగి పంటల సాగుకు సంబంధించిన ఎనిమిది క్విం టాళ్ల మేర ఐదు రకాల అపరాలకు సంబంధించిన విత్తన ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

సాంకేతిక విద్యకు ప్రాధాన్యత

- మైదుకూరులో పాలిటెక్నికల్ కళాశాలకు గ్రీన్‌సిగ్నల్
- అన్నమయ్య జిల్లాకు స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల
- మంత్రివర్గ సమావేశంలో పలు సంక్షేమ నిర్ణయాలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ప్రభుత్వం సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సాంకేతిక కళాశాలల ఏర్పాటుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నారు. అన్నమయ్య జిల్లాకు స్కిల్‌డెవలప్ మెంట్ కళాశాలలు, కడప జిల్లా మైదుకూరుల్లో పాలిటెక్నికల్ కళాశాలల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇటీవలి కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనికి అదనంగా మరొక స్కిల్ డెవపల్ మెంట్ కళాశాలను ఏర్పాటు చేస్తారా లేదా అనే తేలాల్చి ఉంది. సాంకేతిక కళాశాలలకు సంబంధించిన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జులై నెలలోని సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు ఈ నెల 18న జగనన్నతోడు, 21న నేతన్న నేస్తం, 26న డ్వాక్రా రుణాల సున్నావడ్డీ జమ, విదేశీవిద్య వంటి పథకాలకు నిధు లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కడప జిల్లాలో సుమారు 9,245 మంది నేతన్ననేస్తం, అన్నమయ్య జిల్లాలో సుమారు 6,672 మంది చేనేతలకు లబ్ధి చేకూర నుంది. ఇదే తరహాలో కడప, అన్నమయ్య జిల్లాల్లో వేలాది మంది డ్వాక్రా రుణాల వడ్డీమాఫీ కానుంది. 28న జగనన్నతోడు లబ్ధిదారులకు లబ్ధి చేకూరనుంది.

అక్రమ బదిలీలను వ్యతిరేకిస్తూ నిరసన : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిరాజ

ఇటీవల జరిగిన ప్రభుత్వ అక్రమ బదిలీలు రద్దు చేయాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ పేర్కొన్నారు. బుధవారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఒక పెద్ద ప్రహసనంగా జరిపారని పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంత్ సమస్య కారణంతో నేటికీ జీతాలు చేయకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ బదిలీలలో జరిగిన పొరపాట్లను సవరించలేదని చెప్పారు. జిల్లాలో 15 మందికి ప్రభుత్వ అక్రమ బదిలీలు నిర్వహించారని, పిజిటి లుగా వెళ్లిన స్కూల్ అసిస్టెంట్లకు నేటికీ జీతాలు అందడం లేదని, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ అయిన పాఠశాలలకు డిడిఒ కోడ్‌లు రాలేదని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్ట్ లేని కారణంగా ఉపాధ్యాయులకు జీతాలు చేయడంలో ఉన్న సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. పై సమస్యల పరిష్కారం కొరకు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కడప డిఈవో కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, పాలెం మహేష్ బాబు, గౌరవ అధ్యక్షులు నాగార్జునరెడ్డి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఏజాస్ అహమ్మద్, శ్రీనివాసులు, మురళీకృష్ణ, సి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ పాల్గొన్నారు.


షరీఫ్ ఖాన్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

జిఎస్‌టి రిటర్న్స్ గడువు పెంచాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిఎస్‌టి అన్ని రకాల వార్షిక రిటర్న్స్ గడువును పెంచాలని ఎపి టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.షరీఫ్ ఖాన్ తెలిపారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జిఎస్‌టి చట్టం వచ్చిన తర్వాత ప్రతి వ్యాపారస్తుడు తన వార్షిక టర్నోవర్ సంవత్సరానికి రూ.2 కోట్లు దాటిన వాళ్లు కచ్చితంగా జిఎస్‌టిఆర్ 9.9 శాతం రిటర్న్స్ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 లోపల ఫైల్ చేయవలసి ఉంటుందని తెలిపారు. కాంపోజిషన్ డీలర్స్ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 30వ లోపల వార్షిక రిటర్న్స్ ఫైల్ చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. అలా చేయని పక్షంలో రోజుకు రూ.200 ప్రకారం పెనాల్టీ కట్టవలసి ఉంటుందని చెప్పారు. 2017-18 నుంచి 2021-22 వరకు మన రాష్ట్రంలోనే కాకుండా, భారతదేశంలో కొన్ని లక్షల మంది ఈ రిటర్న్స్ ఫైల్ చేయలేదని చెప్పారు. ఈ రిటర్న్స్ ఫైల్ చేయని వ్యాపారస్తులకు లక్షల్లో పెనాల్టీ, నోటీసులు డిపార్ట్మెంట్ వారు ఇచ్చారని పేర్కొన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా దేశం మొత్తం మీద వివిధ రకాల వ్యాపార సంఘాల నుంచి వచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకుని లక్షల్లో వస్తున్న లేట్ ఫీజును తగ్గించాలని 2022, డిసెంబర్ 19వ తేదీన ఎపి టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ నేతృత్వంలో ఢిల్లీలోని జిఎస్‌టి కౌన్సిల్ చైర్మన్ వివేక్ జోహరికి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి వినతిపత్రం అందజేశామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు షరీఫ్ ఖాన్ చేసిన సేవలను గుర్తించి గుంటూరులోని క్యాపిటల్ హోటల్‌లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు కెఎస్ఆర్ఎం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కడప అర్బన్

రిషికేష్ క్రికెట్ క్రీడా మైదానంలో ఈ నెల 3 నుంచి 5 వరకు 9ఎ సైడ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఏషియన్ నైన్ఎ సైడ్ క్రికెట్వారి సంయుక్త ఆధ్వర్యంలో 4వ జాతీయ 9ఎ సైడ్ క్రికెట్ ఫెడరేషన్ చాంపియన్షిప్-2023 పోటీలకు కళాశాల విద్యార్థి బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న వి.హర్ష వర్ధన్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ష వర్ధన్ ఎపి జట్టుకు ప్రాతనిధ్యం వహించారని తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు వంశీ నాయక్, నారాయణ, ఇసిఇ విభాగాధిపతులు డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీలు

దొంగ డాక్యుమెంట్లతో భూకబ్జాలు : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడపలో వైసిపి భూ దొంగలు దొంగ డాక్యుమెంట్లతో భూకబ్జాలు చేస్తూ రెచ్చిపోతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గాయత్రి టవర్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూకబ్జాలు, అక్రమ లేఅవుట్ల నిర్మాణంలో కడప ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్ల హస్తం ఉందన్నారు. మూడేళ్ల కాలంలో కడపలో కేవలం సాయిమిత్ర డెవెలపర్స్ పేరు మీద 90 వేల గజాలకు మాత్రమే అధికారిక అనుమతి ఉందని చెప్పారు. నాలుగేళ్లలో ఇన్ని వందల వెంచర్లు, అక్రమ లేఅవుట్లు ఎలా వెలిశాయని ప్రశ్నించారు. మినిస్టర్ లేఅవుట్ పేరుతో అనుమతిలేని కొత్త లేఅవుట్ సృష్టించి, ప్రయివేట్ భూమి కొని, పక్కనే వున్న ప్రభుత్వ భూమిని ఖాజేశారని విమర్శించారు. మంత్రి లేఅవుట్‌కు ఇంకా లాండ్ కన్వర్షన్ కాలేదు కానీ ఆయన అప్పుడే లేఅవుట్లు వేసి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రభుత్వ భూమిని పేదవాడికి అమ్ముతున్న వైసిపి నాయకులు భూ దొంగలని అభివర్ణించారు. ప్రజలెవరు వైసిపి భూదొంగలు అమ్మకానికి పెట్టే స్థలాలు, లేఅవుట్లు, భూములు కొనవద్దని విజ్ఞప్తి చేశారు. మాజీ సైనికుల అధికారుల పేరుతో విచ్చలవిడిగా భూ దందాలు జరుగుతున్నాయని, మిలటరీలో రెండేళ్ల పనిచేసి రిటైర్ అయిన వారి పేరుపై స్థలాలు స ృష్టించి అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అక్రమంగా వెలిసిన అక్రమ లేఅవుట్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ లేఅవుట్లపై కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంటనే ఓ కమిటీని వేసి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వైసిపి కార్పొరేటర్ల పేరుతో ఆన్లైన్ అయినా స్థలాల వివరాలు తన వద్ద ఉన్నాయని, త్వరలో పూర్తి వివరాలు బహిర్గతం చేస్తానని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులే భూసమస్యల పై సిగ్గులేకుండా పంచాయతీలు చేస్తున్నారని విమర్శించారు. ప్రకాష్ నగర్‌లో బద్వేలు ఎమ్మెల్యేకు చెందిన ఫ్లాట్ ను కూడా వైసిపికి చెందిన వారు కబ్జా చేసి అమ్మేశారని, ప్రజా ప్రతినిధుల స్థలాలకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటన్నారు. కడప ప్రజలు తమ ఆస్తులు, భూములు, ఖాళీ స్థలాలు ఉన్నాయి లేదో తరచూ చూసుకోవాలని సూచించారు.అధికారులు సైతం వైసిపి నేతలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు.

పేదలకు దక్కని భూములు : వ్య.కా.స

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని పేదలు సాగు చేసుకుంటున్న భూములకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇస్తారని ఆశగా ఉండేదని ఆ ఆశ నిరాశగా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు యంబడి పోలయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 10 గ్రామాల పేద ప్రజలు 13 సంవత్సరాల నుంచి అసైన్‌మెంట్ భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పట్టాలు అధికారులు అసైన్‌మెంట్ కమిటీలో ఇస్తామని సాకులు చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారని విమర్శించారు. పట్టాల కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పర్యాయాలు ధర్నాలు, రాస్తారోకోలు కూడా చేశామన్నారు. ప్రభుత్వ అధికారులకు చలనం లేదన్నారు. ఈ మధ్యకాలంలో అసైన్‌మెంట్ కమిటీ త్వరలో జరుగుతుంది పట్టాలు ఇస్తామని పేద ప్రజలకు నాయకులు అధికారులు మాయ మాటలు చెప్పి వారిని నమ్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు దాని ఆచూకీ లేదన్నారు. రహస్యంగా అసైన్‌మెంట్ కమిటీ జరిగిందా? ఆ కమిటీ పేదలకు దక్కకుండా పోయిందా? ఇప్పటికైనా జిల్లా అధికారులు మండలంలోని అమగంపల్లె, ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, ఆకుల నారాయణపల్లె, నాయనపల్లెచ, వరిగుంట్ల, కొండరాజుపల్లె, గంగనపల్లె గ్రామాల పేద ప్రజలు పేదలు భూములు సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

వైసిపి గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్‌కు సన్మానం

ప్రజాశక్తి-కడప

వైసిపి గల్ఫ్ కన్వీనర్‌గా నియమితులైన బిహెచ్.ఇలియాస్‌ను ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు ఘనంగా సన్మానించారు. బుధవారం ఎన్ఆర్ఐ గ్రూప్ కడప బాలిరెడ్డి, అన్సర్, గయాజ్, బాబు, గోవిందు నాగరాజు, అక్రమ్ ఆధ్వర్యంలో కడప నగరంలోని నూర్జహాన్ ఫంక్షన్ హాలులో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పి.రవీంద్ర నాథ్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర, జిల్లా నాయకులు ఇలియాస్ అభినందన శుభాకా ంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొ రేటర్లు, డివిజన్ ఇన్‌ఛా ర్జులు, నగర నాయ కులు పాల్గొన్నారు.

ఇలియాస్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ

ప్రజాశక్తి-కడప

జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక విద్యుత్ భవన్ నుండి "డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఇ ఎస్.రమణ తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు విద్యుత్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే 08562-242457 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ ఇంటి వద్ద నుండే పైతెలిపిన నంబర్‌కు ఫోన్ చేసి తమ విద్యుత్తు సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కడప

కాలువను పరిశీలిస్తున్న నాయకులు

రాజీవ్ పార్క్ సమీపంలో డ్రెయినేజీ కాలువ పైన వేసిన నాసిరకపు బండలు వెంటనే తొలగించి నాణ్యమైన కాంక్రీట్‌తో కూడిన బండలను వేసి ప్రమాదాలను అరిక ట్టాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధురెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు బుధవారం కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరానికి ముఖ్యమంత్రి వస్తున్నాడని అత్యవసరంగా ఏర్పాట్లు చేసి డ్రెయినేజీపై నాసిరకపు బండలు వేశారన్నారు. కాలువ దాటుతున్న వ్యక్తి బండపైన కాలు పెట్టగానే బండ విరగటంతో కాలువలో పడటం జరిగిందన్నారు. కమిషనర్ అక్కడ పర్యటించి అలాంటి క్వాలిటీ లేని బండలని తొలగించి సిమెంటు కాంక్రీటుతో కాలుపైన బండల్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ సిఆర్‌సికి సన్మానం

ప్రజాశక్తి-కడప

ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యను బుధవారం ఆయన నివాసంలో వైఎస్.జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు ఎం.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ప్రజాశక్తి-కడప

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కడప పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై టిడిపి నాయకులు చేసిన విమర్శలపై చర్చకు సిద్ధమని వైసిపి నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, వైసిపి కార్పొరేటర్ షఫీ, నాయకులు సవాల్ విసిరారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజీవ్ పార్క్, మార్గలను ముఖ్యమంత్రి అభివృద్ధి చేస్తే ఓర్వలేని టిడిపి నాయకులు విమర్శలు చేయడం దారుణమన్నారు. మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు, బుగ్గ వంక ఇరువైపులా ప్రహరీ గోడ నిర్మాణం, దేవుని కడప రోడ్డు విస్తరణ పనులు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి యూత్ ప్రధాన కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు, సుబ్బారెడ్డి చెన్నయ్య, శ్రీరంజన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో పనులు పరిశీలన

ప్రజాశక్తి-కడప అర్బన్

వైయస్సార్ స్పోర్ట్స్ స్కూల్ పరిశీలనలో భాగంగా వాలీబాల్ కోర్ట్, హాకీ గ్రౌండ్, రన్నింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, బాక్సింగ్ రింగ్, జిమ్, జిమ్నాస్టిక్ పరిసరాలను నగరపాలక కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ పరిశీలించారు. బుధవారం స్పోర్ట్స్ స్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. ఏడవ తరగతి విద్యార్థులకు సోషల్ పాఠాలను బోధించారు. ప్రతి చిన్న విష యాన్ని ఊహించి చదవాలని అలా చదువుకున్నప్పుడు విద్యార్థులకు మనము ప్రశ్న వేసుకుని ఆ జవాబును నేర్చుకున్నప్పుడు ఆ ప్రశ్నలు జవాబులు సులువుగా గుర్తుపెట్టుకోవచ్చునని చెప్పారు. విద్యార్థులు సబ్జెక్ట్‌ను సులువు తరంగా గుర్తుపెట్టుకోనే విధంగా ఉపాధ్యాయులు వారికి బోధించాలని సూచించారు. స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ తో మాట్లాడుతూ విద్యార్థుల, కోచర్ల షెడ్యూల్ వివరాలను పరిశీలించారు. పాఠశాలలో ఔటర్స్ ఎంట్రీ రిజిస్టర్‌లను ఏర్పాటు చేసి వారి పూర్తి వివరాలను నమోదు చేయయాలన్నారు.

వెంకటరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

భౌతిక శాస్త్రంలో అంతర్జాతీయ పరిశోధనకు అవార్డు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కె.వెంకటరావు వర్ణపట శాస్త్రం, పదార్థాల విశ్లేషణ అనే అంశంపై చేసిన పరిశోధనలకు అంతర్జాతీయ ఆసియా పరిశోధన అవార్డ్‌ను తమిళనాడులోని తిరుచ్చిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అంతర్జాతీయ అత్యుత్తమ పరిశోధన అవార్డు అందించారు. ఈ సందర్భంగా కశాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన అభినందన సమావేశం నిర్వహించి వారి పరిశోధన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ వెంకటరావుకు అవార్డు రావడం ఎంతో అభినందనీయమని, ఆయన పరిశోధనలు యువ పరిశోధనకులకు మార్గదర్శకం అవుతాయని కొనియాడారు. అనంతరం వెంకటరావును సన్మానించారు.

సర్పంచ్ సొంత నిధులతో మంచినీటి సౌకర్యం

ప్రజాశక్తి-పోరుమామిళ్లటౌన్

మండలంలోని అక్కరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని సచివాలయం దగ్గరలో ఉన్న మంచినీటి బోరు చెడిపోయింది. గ్రామ ప్రజలు మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న సర్పంచ్ గొడుగునూరి గోపాలమ్మ సొంత నిధులతో కొత్త బోరును ఏర్పాటు చేశారు. ప్రజల మంచినీటి వసతుల్ని కల్పించారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎక్కలూరి శీను, ప్రభుదాస్, పాలకొల్లు రామచంద్రారెడ్డి, దాసరిపల్లె పిచ్చయ్య, రాయపాటి పాపయ్య పాల్గొన్నారు.

వనరులను వినియోగించుకోవాలి : విసి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని విసి ఆచార్య చింతాసుధాకర్ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలోని గురుకులంలో ఎంబిఎ రూ.1.3 లక్షలతో ఆర్ఒ ప్లాంట్, రూ.50 వేలతో నిర్మించిన ఫ్లోరింగ్‌ను ప్రారంభించారు. గ్రంథాలయంలో అదనంగా రూ. 50 వేల విలువ గల నూతన పరిశోధన, ప్రామాణిక పుస్తకాల విభాగాన్ని, ఎంబిఎ శాఖ అధిపతి ప్రత్యేక గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ ఎంపిఎ శాఖ అధిపతి అమృత ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆర్ఒ ప్లాంట్, ఇతర వసతులు సిద్ధమయ్యాయని అభినందించారు. ఎంబిఎ శాఖ విభా గాధిపతి అమృతప్రసాద్‌రెడ్డి అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, సిడిసి డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, ఎంబీఏ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ పి.వి.వరప్రభాకర్, డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి, డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, డాక్టర్ పి. సరిత, కామర్స్ శాఖ ఆచార్యులు విజయభారతి, ఎంబీఏ శాఖ అకాడమిక్ కన్సల్టెంట్లు టి. అనిల్ దేవకుమార్, పి.రాజశేఖర్, సుధీర్ కుమార్, వెంకటరమణ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జగనన్న ప్రభుత్వంలో ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక 11,12 వార్డులోని సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే పరిష్కారం చేసి, అలాగే ఒక టోకెన్ నెంబర్ ఇచ్చి వాళ్ల సమస్యలు పరిష్కరించేలా పనిచేయాలన్నారు. అలాగే 11,12 వ వార్డులో ఇంటి స్థలాలు మంజూరు కాలేదని, కొందరికి వితంతు పింఛన్ రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురక్ష కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు తెలియజే యాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, కౌన్సిలర్ పొచ్చిరెడ్డి, సచివాలయ కన్వీనర్ దంపెట్ల వేణుగోపాల్, పరిశ్రమల డైరెక్టర్ మార్పుల్ శ్రీను, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చాపాడు : ప్రజల సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపిపి టి లక్షుమయ్య తెలిపారు. లక్ష్మీపేటలో బుధవారం జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో 500 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధా కృష్ణవేణి, డిటి భవానీ, ఎఒ మ్యాగీ, సర్పంచ్ శ్రీవిద్య, రైతు సలహా మండలి సభ్యులు నారాయణరెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, నాయకులు చంద్రమోహన్ రెడ్డి, జయరాజు, చంద్ర, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపిపి లక్షుమయ్య

మైదుకూరులో.. మండల పరిధిలోని మిట్టమానుపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రఘురామిరెడ్డి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, తహశీల్దార్ అనురాధ, ఎడిఎ క్రిష్ణమూర్తి, వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్‌నారాయణ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముద్దనూరు : కులమత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైసిపి నాయకులు శివశంకర్‌రెడ్డి అన్నారు. యామవరంలో బుధవారం ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సర్పంచు అనసూయ, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

మైలవరం : పలు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాఉ చేసిందని ఎంపిడిఒ రామచంద్రారెడ్డి తెలిపారు. దొమ్మర నంద్యాల గ్రామ సచివాలయం వన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ తిరుపతయ్య, వైసిపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : బాకరాపురం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత సేవ అందించాలనే ఉద్దేశ్యంతో సిఎం జగన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల-1 సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందించడమే ఈ సభ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ భాగ్యలక్ష్మీ, పిఆర్ ఎఇ లక్ష్మీనారాయణ, సర్పంచు, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆరవ సచివాలయం పరిధిలోని షాదీఖానాలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు కోకోకోల గౌస్, గైబున్నీసా, పెన్నా రసీద్, రామాంజనేయులు, 12వ వార్డు ఇన్‌ఛార్జి యూసుఫ్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ షర్ఫుద్దీన్, నాయకులు టైలర్ శివ, గడికోట రషీద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక బస్టాండు కూడలిలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం వైసిపి నాయకులు, వాలంటీర్లు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడాలి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి సిద్దుగారి భాస్కర్‌రెడ్డి, జడ్‌పిటిసి దవనం గంగాధర్, సచివాలయం కన్వీనర్ పి.గోపాల్ రెడ్డి, పార్టీ కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కలసపాడు : వాలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసిపి మండల నాయకులు పిపి నారాయణ, జడ్‌పిటిసి గురివిరెడ్డి, కొత్తకోట పిఎసి వైస్ ప్రెసిడెంట్, సింగిల్ విండో అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ చిత్త రాజశేఖర్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా నడిరోడ్డుపై గుంత

ప్రజాశక్తి - ముద్దనూరు

రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత

స్థానిక పాత బస్టాండ్ కూడలి నడి రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. వర్షం కురిస్తే నీటితో గుంత కనపడక ప్రమాదకరంగా ఉంటుంది. వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక పలు వాహనాలు, బస్సు కుదుపుల వల్ల ప్రయాణికులు హడలి పోతున్నారు. వృద్ధులు, మహిళలు నడ్డి విరిగిపో తుందని ఆవేదన చెందు తు న్నారు. ఆర్అండ్‌బి డిఇ కార్యాలయం ఇక్కడే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

366 పరుగులకు నెల్లూరు జట్టు ఆలౌట్

ప్రజాశక్తి - కడప

సయ్యద్ సాహుల్ హమీద్ సెంచరీ చేయడంతో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 366 పరుగుల భారీ స్కోరు సాధించింది. వైయస్ రాజారెడ్డి ఎసిఎస్ స్టేడియంలో జరుగుతున్న కడప, నెల్లూరు మ్యాచ్‌లో ఒక వికెట్ నష్టానికి 56 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 101.0 ఓవర్లలో 366 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సయ్యద్ సాహుల్ హమీద్ అదుతేంగా బ్యాటింగ్ లో రాణించాడు. 206 బంతులను ఎదుర్కొని 23 బౌండరీల సహాయంతో 129(సెంచరీ) పరుగులు చేశాడు. మరో బ్యాట్స్మెన్ జి. మన్విత్ రెడ్డి 83 పరుగులు చేశాడు. కడప జట్టులోని షేక్ మొహమ్మద్ అస్లాం 3, సాయి అర్జిత్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లు ఆడి పరుగులు ఏమి చేయలేదు.

హోరాహోరీగా చిత్తూరు, అనంతపురం మ్యాచ్

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ హెూరాహెూరీగా సాగుతోంది. 4 వికెట్ల నష్టానికి 130 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు 56.3 ఓవర్లలో 253 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ప్రశాంత్ 79 పరుగులు చేశాడు. చిత్తూరు గట్టు లోని మొహమ్మద్ ఇరాన్ 3, డి. బాలాజీ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 62.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఆ జట్టులోని సి. లోహిత్ లక్ష్మీనారాయణ 54 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని ప్రదీప్ రెడ్డి 3, లీలా సాయి 3 వికెట్లు తీసుకున్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు

పట్టని అధికారులు, నాయకులు - సేవా దృక్పథంతో నిర్మించినా వృథా

నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మున్సిపాలిటీ పరిధిలో పలు బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. ప్రజలకు ఉపయోగకరమైన బస్‌షెల్టర్లను అటు అధికారులు గానీ, ఇటు నాయకులు గానీ గాలికి వదిలేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు తరచూ బస్సుల్లో ప్రయాణిస్తూంటారు. వీరు బస్ కోసం వేచి ఉండే సమయంలో ఎండ, వానకు ఇబ్బందులు పడకూడదనే మానవతా దృక్పథంతో పోట్లదుర్తి గ్రామానికి చెందిన దివంగత మాజీ టిటిడి బోర్డు సభ్యులు చింతకుంట సత్యనారాయణ నాయుడు కొన్నేళ్ల క్రితం తన సొంత నిధులు వెచ్చించి పట్టణంలో పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్‌లను నిర్మించారు. అందులో ఒకటి రైల్వేస్టేషన్ వెలుపల, ఇంకొకటి ప్రకాష్ నగర్ వద్ద, మరొకటి వేంపల్లి రోడ్డులోని ఆసనం వద్ద ప్రజలు బస్సు కోసం వేచి ఉండే సమయంలో కూర్చునేలా నిర్మించారు. వీటికి సంబంధించి దాదాపు రూ.6 నుండి రూ.8 లక్షలు సొంత డబ్బును సత్యనారాయణ నాయుడు ఖర్చు చేశారు. అధికారుల, నాయకుల నిర్లక్ష్యంతో రైల్వేస్టేషన్ వెలుపల ఉన్న బస్‌షెల్టర్, ప్రకాష్ నగర్‌లో ఉన్న బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారాయి. ఒక్క వేంపల్లి రోడ్డులోని ఆసనం వద్దనున్న బస్సుషెల్టర్ మాత్రమే మనుగడలో ఉంది. ప్రజల కనీస అవసరాలు తీర్చే పరిస్థితిలో కూడా అధికారులు, నాయకులు లేకపోవడం చాలా బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు. బస్‌షెల్టర్లు పడిపోయే పరిస్థితి ఏమైనా ఉందా అంటే అలాంటిదేమీలేదు. బస్‌షెల్టర్ లోపల మట్టి కుప్పలు, కంప చెట్లు, వ్యర్థాలతో నిండి ఉన్నాయని, దీంతో ప్రయాణికులు బస్సుషెల్టర్ వెలుపల వేచి ఉండి వెళుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సేవాభావంతో తమ సొంత నిధులతో నిర్మిస్తే.. కనీసం నిర్వహణ చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఎంతైనా ఉంది. మునుపు "మన ఊరి కోసం టీం" పేరుతో పట్టణంలోని కొందరు యువకులు కలిసి రైల్వే వంతెనపై మొక్కల కుండీలను తమ సొంత నిధులతో ఏర్పాటు చేసినా, మున్సిపల్ అధికారులు వాటికి కనీసం నీరు కూడా పట్టకపోవడంతో అవి ఎండిపోయాయి. ఇప్పటికైనా బస్‌షెల్టర్లలోని మట్టిని, వ్యర్థాలను తొలగించి వాటిని మళ్లీ మనుగడలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, నాయకులను ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు చెప్పి క్లీన్ చేయిస్తాం..

ఆర్‌టిసి బస్టాండ్ మాత్రమే మా పరిధిలోకి వస్తుంది. బయట ఉన్న బస్‌షెల్టర్లు ప్రయివేట్ వ్యక్తులు కట్టించారు. కానీ ప్రజల సౌకర్యార్థం కట్టించినవి కాబట్టి, మున్సిపల్ అధికారులకు తెలిపి క్లీన్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

- మల్లికార్జునరెడ్డి, ఆర్‌టిసి మేనేజర్, ప్రొద్దుటూరు.

త్వరలోనే చర్యలు చేపడుతాం..

బస్‌షెల్టర్ల వద్ద వ్యర్థాలు, మట్టి పేరుకు పోయాయని, ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉందని తెలిసింది. అక్కడ శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకున్నాం. అలాగే బస్సుషెల్టర్లకు రంగులు వేసేందుకు స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడుతున్నాం. తొందరలోనే ఆ పనులు చేస్తాం.

- పగడాల జగన్నాథ్, కమిషనర్, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ

మైదుకూరులో రూ.15 కోట్లతో మురుగు కాలువలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పట్టణంలో రూ.15 కోట్లతో నూతనంగా సిమెంట్ లైనింగ్ మురుగు కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన మైదుకూరు మున్సిపాలిటీని వేగంగా అభివృద్ధి చేస్తున్నా మన్నారు. ఇందిరమ్మ కాలనీలో రూ.6 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఎర్రచెరువు అభివృద్ధి పనులను ప్రారం భిస్తామన్నారు. అయిదెకరాల్లో పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టామని, త్వరలో పనుల ప్రారంభిస్తామన్నారు. గడపగడపకు తిరిగి చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. చంద్రబాబు హయాంలో ఒక ఇంటికి కూడా స్థలం కేటాయించలేదన్నారు. నేడు వేలాదిమందికి ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. నాలుగేళ్లుగా మున్సిపాలిటీలో నీటి కోసం ట్యాంకర్లను వాడే పరిస్థితి రానీయకుండా చూశామన్నారు. వాలంటరీ వ్యవస్థను పవన్‌కళ్యాణ్ విమర్శించడం సమంజసం కాదన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రంగస్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమణ్‌నారాయణరెడ్డి, వైసిపి నాయకులు షరీఫ్, రాయుడు, లక్ష్మమయ్య, కిరణ్మయి, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రభుత్వ అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆ దారిని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నాగులకట్ట నుండి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. జమ్మలమడుగు నుండి విజయవాడ, తిరుపతి, కడపకు రాత్రి, తెల్లవారుజామున రైళ్లు నడుస్తున్నాయన్నారు. రైళ్లు కూడా రాత్రి 10 గంటల సమయంలో, ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు వస్తూ, పోతున్నాయన్నారు. ప్రజలు కూడా ఎక్కువ సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రయాణికులు రాకపోకల సందర్భంగా భయాందోళనలకు గురవుతున్నారన్నారు. పోలీసు వారు కూడా రైళ్ల రాకపోకల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తే క్షేమకరంగా ఉంటుందన్నారు. రోడ్డు బాగా లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, రామయ్య, చిన్ని, విజయ్ పాల్గొన్నారు.

వీధి దీపాల్లేవని చూపిస్తున్న నాయకులు

గింజ నాణ్యతకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

సొద్దు తిరుగుడు పంటలో గింజ నాణ్యతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవ సాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని యామవరం గ్రామంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పొద్దు తిరుగుడు పంటను బుధవారం ఎఒ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దు తిరుగుడు పంట 100 ఎకరాల వరకు సాగుచేశారన్నారు. కొంత మంది రైతుల పొలాల్లో పంట పువ్వు దశలో ఉందన్నారు. ఈ సమయంలో నీటి ఎద్దడి లేదా బెట్ట దశకు గురి కాకుండా పంటను కాపాడుకోవాలన్నారు. ముఖ్యంగా పెరిగే దశ, మొగ్గ దశ, పూత దశ, గింజ గట్టిపడే సమయంలో భూమిలో తేమశాతం ఉండేలా చూసు కోవాలన్నారు. గంధకం తక్కువగా ఉన్న నేలలో 10 కిలోల గంధకాన్ని జిప్సం రూపంలో 55 కిలోలు ఒక ఎకరానికి వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల గింజలో నూనె శాతం బాగా ఏర్పడుతుందన్నారు. పరాగసంపర్కం జరగ డానికి తేనేటీగలు ఎంతగానో సహకరిస్తాయన్నారు. పుష్పించే సమయంలో హానికరమైన రసాయన పురుగు మందులను పిచికారి చెయ్యకూడదన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల సమయాల్లో సున్నితమైన మెత్తని వస్త్రంతో పువ్వు మీద రుద్దాలన్నారు. వారంలో ఒక్కసారి ఇలా చెయ్యడం వల్ల ఫలదీకరణ సక్రమంగా జరిగి గింజ నాణ్యత పెరుగుతుందన్నారు.

హామీని అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌కుమార్ కోరారు. ఆ మేరకు బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేస్తామని మాట ఇచ్చారన్నారు. దాని సిఎం జగన్ నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలో సుమారు 40 వేల మంది మున్సిపల్ కార్మికులు 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పోరేషన్లు, నగర పంచాయితీల్లో పని చేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదన్నారు. గతంలో అనేక తీర్పుల్లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు టైంస్కేల్ అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా, నేటికి అమలుకావడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి నాగన్న, శేఖర్, కోశాధికారి శివ, సిఐటియు నాయకులు దాసరి విజయ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు చెప్పిన హామీలను నెరవేర్చాలని మున్సిపల్ కార్మిక సంఘ (సిఐటియు అనుబంధం) ప్రొద్దుటూరు శాఖ ప్రధాన కార్య దర్శి సాల్మన్ కోరారు. ఆమేరకు స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డికి బుధ వాం విపతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు చంటి, కోశాధికారి రాఘవేంద్ర పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వారంలోపు పనులు పూర్తికి చర్యలు : ఓఎస్‌డి

పనులను పరిశీలిస్తున్న ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మోడల్‌టౌన్‌లో భాగంగా జరుగుతున్న పలు పనులను వారంలోపు పూర్తి చేయాలని పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆ పనులను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డి మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆంజనేయస్వామి గుడి వైపు నిర్మాణ పనులు ఎలా చేయాలో అధికారులకు సూచించారు. గరండాల రివర్‌లోకి ప్రవేశద్వారం నుంచి కాకుండా వంక అటు వైపు నుంచి లోపలికి రాకుండా నిరోధించేందుకు రక్షణ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏ విభాగానికి ఎంత రుసుం వసూలు చేయాలో నిర్ణయించి వారం లోపు పూర్తి చేయాలని అధికారులతో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఇ మహేశ్వరరెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, ఇఇలు సిద్దారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మోడల్ టౌన్ మేనేజర్లు కృష్ణకుమార్, రాజ్‌కుమార్, మైనర్ ఇరిగేషన్ డిఇలు, ఎఇలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

30 గొర్రెల అపహరణ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి మందలోని 30గొర్రెలు అపహరణకు గురయ్యాయని బాధితుడు సోమిరెడ్డిపల్లెకు చెందిన రమణయ్య వాపోయాడు. కుటుంబ పోషణకు అప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రెలను మేపుకొని రాత్రి దొడ్డిలో వాటిని తోలానని, బుధవారం గొర్రెల వద్దకు వచ్చి చూడగా దాదాపు 30 గొర్రెలు కనిపించలేదన్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో, పొలాల్లో వెతికినా ప్రయోజనం లేదన్నాడు. తనమీద దయవుంచి పోలీస్ అధికారులు న్యాయం చేయాలని, దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు, కడప

M.V.O.P.NO. 310/2023

చాపల నరసింహులు తండ్రి పిచ్చి పాపయ్య లేట్, బొరెడ్డి వీధి, నాగరాజుపేట, కడప టౌన్.

...పిటిషనర్

వర్సెస్

షేక్ కరీముల్లా తండ్రి అబ్దుల్ గఫూర్ డ్రైవర్, ఏపిఎస్ ఆర్టీసీ, కడప డిపో డోర్ నెంబర్ : 10/25-15, 10 వ వార్డ్, ఖలీల్ నగర్, కడప టౌన్ & కడప జిల్లా.

...రెస్పాండెంట్ నెంబర్:1

పైన తెల్పిన పిటిషనర్ యాక్సిడెంట్ నష్ట పరిహారం కోరుతూ నీపై పైకోర్టులో పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల స్వయంగా గాని ,వకీలు ద్వారా గానీ 25-07-2023 వ తేదీన ఉదయం 10-30 గంటలకు హాజరై మనవి చేసుకోవలయును. లేనంతట నీ పరోక్షమున తీర్మానించబడును.

// బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//

యు.వెంకట స్వామి, M.Com,LLB
పిటిషనర్ పరం అడ్వకేట్
రాజంపేట

ఎన్‌సిడిసి రుణాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - చాపాడు

సమావేశంలో మాట్లాడుతున్న శారదమ్మ

గొర్రెల పెంపకం కోసం మంజూరు చేసిన ఎన్‌సిడిసి రుణాలను వెంటనే చెల్లించి సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా యూనియన్ ఫంక్షనల్ రిజిస్ట్రార్ డాక్టర్ సి.శారదమ్మ సూచించారు. మైదుకూరు వెలుగు కార్యాలయంలో బుధవారం జిల్లా గొర్రెల పెంపక దారుల సహకార యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా శారదమ్మ మాట్లాడుతూ 2009 నుంచి 2011 వరకు ఎన్‌సిడిసి ద్వారా పొందిన రుణాలకు సంబంధించి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. లేదంటే సహకార సంఘ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చెల్లించిన వారికి మళ్లీ రుణాల మంజూరులో ప్రాధాన్యతనిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా చైర్మన్ నాగమల్లేశ్వరయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పిరమణా రెడ్డి, యూనియన్ కార్యవర్గ సభ్యులు, జమ్మలమడుగు ఉప సంచాలకులు డాక్టర్ ఎన్ఎ శ్రీనివాసులు, సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ గీతాప్రియ, మైదుకూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ గురివిరెడ్డి, మైదుకూరు, ప్రొద్దుటూరు నియోజక వర్గాల ప్రాథమిక గొర్రెలు, మేకల పెంపకం దారుల సహకార సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వం అందించే నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలోని అలిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న ప్రభుత్వ బిసి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని, ప్రభుత్వ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పాఠశాలలో, హాస్టల లో ఉన్న విద్యార్థులను మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అనే వాటిపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. మెనూ నోటీసు బోర్డును పరిశీలించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థలకు సూచించారు. ముందుగా మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధిని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుజాత, గురుకుల పాఠశాల హెచ్ఎం హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వారిని ఆదుకోవాలి అని (ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం) పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆదాము, ప్రసాద్ రెడ్డి కోరారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికులను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. నిత్యం ప్రజా రవాణాలో ఆటో రంగం కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. బేషరత్తుగా బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. సమావేశంలో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల సిఐగా ఈశ్వరయ్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో కర్నూలు జిల్లా నుండి ఎర్రగుంట్ల స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుం టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పనిచేస్తామని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి టిడిపిని గెలిపించండి

ప్రజాశక్తి - కమలాపురం

రాష్ట్రాభివృద్ధికి టిడిపిని గెలిపించాలని పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కోరారు. పొడదుర్తి పంచాయతీలోని పొదదుర్తి, వెంకటాపురం, యర్రబల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా కృష్ణచైతన్య రెడ్డి ప్రతి ఇంటింటికి తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమన్నారు. 18ఏళ్ల పూర్తయిని మహిళలకు నెలకు రూ.1500 వచ్చే బెనిఫిట్స్ వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాఘవరెడ్డి, మాజీ హాస్పిటల్ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

I.A.No. 453/2021
I.A.No.173/2020
O.S.No. 19/2020

బి.రవీంద్రనాథరెడ్డి.

...పిటీషనర్/పిటీషనర్/వాది

Vs

1. నంద్యాల రెడ్డెప్ప & 16 మంది ఇతరులు.

...రెస్పాండెంట్లు/రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై I.A.లో రెస్పాండెంట్లు నెం.15 నుండి 17 వాదులకు పత్రికా ముఖముగా నోటీసులు

To,
R15. శ్రీమతి నంద్యాల సావిత్రి, W/o కి.శే.ఎన్.సోమశేఖర్.
R16. కుమారి నంద్యాల పూజపార్వతి, D/o కి.శే.ఎన్.సోమశేఖర్.
R17. Mr.నంద్యాల వీరగణేష్, S/o కి.శే.ఎన్.సోమశేఖర్.

రెస్పాండెంట్లు 15 నుండి 17ల నివాసం 2-1-301, ఒయవాలతోట, పులివెందుల మిమ్ములను 15 నుండి 17వ ప్రతివాదులుగా చేర్చుటకు గాను పై I.A.ను పిటీషనర్ సలుపగా, సదరు I.A.లో మీ యొక్క హాజరుకు గాను 19-7-2023వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 19-7-2023వ తేదీ ఉదయం 10.30 గం॥ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై పై I.A.నెం నందు మీకు ఏదైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టువారికి తెలుపుకోనంతట, పై I.A.ని పరోక్షముగా తీర్మానించెదరు.

తేది: 11/7/2023

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్ బాబ్జీ,
అడ్వకేటు, కడప.